సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం। 29। ఏప్రిల్। 2025



సోమశిలలో 51.268 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 51.268 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 110 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.97,900
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,887
3 శాతం జీఎస్టీతో	రూ.9,154
నవర (8 గ్రా)	రూ.73,232

గరిష్టం/కనిష్టం
37.2 /27.7

వాతావరణం

జిల్లాలో మంగళవారం పొడి వాతావరణం ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 58 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

30న పది సెంటర్లలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష



చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహిస్తున్న ప్రిన్సిపల్

నెల్లూరు (టౌన్): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 30న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ ఉమెన్స్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్.ఏసుదాసు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్ష నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 10 సెంటర్లలో పరీక్ష జరుగుతుంది, 4074 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని చెప్పారు. పరీక్ష కేంద్రంలోకి కాలుక్యులేటర్లు, సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు నిషేధమన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు వర్షిణి ఎంపిక



కె.వర్షిణి

గుడ్లూరు: ఈ నెల 30 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న 67వ అండర్ 19 జాతీయ స్థాయిలో స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు రాష్ట్ర జట్టులో గుడ్లూరు మండలం అడవిరాజుపాలెం గ్రామానికి చెందిన కె.వర్షిణి ఎంపికై నట్లు పీఈటీ కవల చిట్టెమ్మ తెలిపారు. వర్షిణి తల్లిదండ్రులైన ధనమ్మ, శ్రీనివాసరావులు రోజువారి కూలీలుగా పని చేస్తున్నారు. వర్షిణికి క్రీడలపై ఉన్న ఆసక్తితో పీఈటీ చిట్టెమ్మ ద్వారా కనిగిరిలో ఖోఖో అకాడమీలో చేర్పించారు. రాష్ట్రస్థాయిలో ఖోఖో పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది.

లోటుపాట్లు లేకుండా సీఎం పర్యటన

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఆనం, కలెక్టర్ ఆనంద్

ఆత్మకూరు: సీఎం చంద్రబాబు ఆత్మకూరు పర్యటనలో లోటుపాట్లు లేకుండా సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. కలెక్టర్, ఎస్పీ ఓ ఆనంద్, కృష్ణకాంత్‌తో కలిసి సోమవారం సాయంత్రం ఆయన సీఎం పర్యటించే మార్గాలు, ఏర్పాటు చేసిన ప్రోగ్రామ్‌లను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు శాఖల వారీగా నివేదికలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సీఎం ఏ శాఖ అధికారులతోనైనా రివ్యూ చేసే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ హుస్సేన్‌సాహెబ్, ఆర్డీఓ బి పావని, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఆర్అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్, హౌసింగ్, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనకు 300 మంది పోలీసులు

నెల్లూరు (క్రైమ్): మే 2న ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమరావతి పర్యటన నేపథ్యంలో జిల్లా నుంచి పది మంది ఎస్‌ఐలు, 60 మంది ఏఎస్‌ఐ/హెచ్‌సీలు, 105 మంది కానిస్టేబుళ్లు, 25 మంది మహిళా పీసీలు, 100 మంది హోంగార్డులు మొత్తం 300 మంది బందోబస్తు విధుల్లో పాల్గొనేందుకు సోమవారం పోలీసు కవాతు మైదానం నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. ఇదే సమయంలో మే 1న జిల్లాలోని ఆత్మకూరులో సీఎం చంద్రబాబు పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. సోమవారం సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, కలెక్టర్ ఓ. ఆనంద్, ఎస్పీ జి. కృష్ణకాంత్ ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై చర్చించారు.

గని కార్మికుల బతుకులపై కూటమి పిడుగు

- తొమ్మిది నెలలుగా మూతపడిన క్వార్ట్జ్ గనులు
- తమ స్వార్థం కోసం పేదలను వీధిన పడేసిన నేతలు
- నష్టాల ఊబిలో మైకా పరిశ్రమ

▸▸ మైకా, క్వార్ట్జ్ పరిశ్రమపై ఆధారపడిన ఐదు వేల కుటుంబాలు

రెక్కాడితే గానీ డొక్కాడని గని కార్మికులపై కూటమి ప్రభుత్వం పగబట్టింది. తొమ్మిది నెలలుగా మైకా, క్వార్ట్జ్ క్వారీ పరిశ్రమలు నిలిచిపోవడంతో బతుకుదెరువు లేక వీధిన పడ్డారు. వాచ్‌మెన్ దగ్గర నుంచి జేసీబీ, పొక్లయిన్, ట్రాక్టర్లు, టిప్పర్లు, గని కార్మికులు ఎందరో వాటిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఆ గనుల్లో పనుల్లేక ఉపాధి లేక.. పిల్లల చదువుకు ఫీజులు కట్టలేక అవస్థలు పడుతున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెట్టే మైకా గనులు జిల్లాకు వరం. ఈ ప్రాంతంలో దొరికే మైకా, క్వార్ట్జ్ ఫల్స్‌పర్‌కు వివిధ దేశాల్లో మంచి గిరాకీ ఉంది. అపారమైన ఖనిజ నిక్షేపాలు ఉన్నా.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గనులన్నీ మూతపడ్డాయి. నూతన పాలసీ పేరుతో మైకా పరిశ్రమలన్నీ ప్రభుత్వమే మూసివేయించి.. సిండికేట్ చేతుల్లోకి తీసుకుంది. కొన్ని గనుల్లో నామమాత్రంగా పనులు చేస్తున్నా.. మిగిలిన క్వారీల్లో పూర్తిగా నిలిపివేశారు. దీంతో మైకా పరిశ్రమలపై ఆధారపడిన కార్మికులకు ఉపాధి లేక ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఉపాధి కోల్పోయిన వేలాది కుటుంబాలు

జిల్లాలో గతంలో 143 గనులు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 80కి చేరుకుంది. వాటికి అనుసంధానంగా 10 ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా 15 వేల మంది, పరోక్షంగా మరో 15 వేల మంది ఉపాధి పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మైకా పరిశ్రమల్లో కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించింది. గడిచిన 9 నెలలు నుంచి కేవలం ఫల్స్‌ఫర్, మైకాకు మాత్రమే నామమాత్రంగా పర్మిట్ ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో వాటిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న గని కార్మికులు వీధిన పడ్డారు.

సంక్షోభంలో యాజమాన్యాలు

ఈ సంక్షోభం ఒక్క కార్మికులకే కాదు గనుల యాజమాన్యాలతోపాటు ఫ్యాక్టరీ యాజమాన్యాలు లారీ యాజమానులపై కూడా ప్రభావం చూపుతోంది. ఇక్కడ లభించే అపారమైన ఖనిజాలను ఇతర రాష్ట్రాలతోపాటు విదేశాలకు లక్షల టన్నుల్లో ఎగుమతులు జరుగుతుండేవి. ప్రస్తుతం ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి.



నిర్మానుష్యంగా కలిచేడు గనుల ప్రాంతం

రాకపోకలు బంద్

సైదాపురం మండలంలో గడిచిన 270 రోజుల నుంచి గనులన్నీ మూతపడడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా నిలిచిపోవడంతో వాహన యాజమానులతోపాటు లోడింగ్ చేసే కూలీలు కూడా ఉపాధి కోల్పోయారు.

మౌనంగా యాజమానులు

ప్రభుత్వ అనుమతులతో మైనింగ్ కార్యకలాపాలు సాగిస్తున్న యాజమానుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టి నిర్వహించే మైనింగ్ ఆపరేషన్ నామమాత్రంగానే జరుగుతుండటంతో ఏమి చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

ఆకలి కేకలతో రోడ్డుపైకి..

మైకా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు సైదాపురం, పొదలకూరు, గూడూరు మండలాల్లో అత్యధికంగా ఉన్నారు. గడిచిన 9 నెలలుగా గని కార్మికులు ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. తమ బిడ్డలకు కనీసం పాఠశాల ఫీజులు కూడా చెల్లించలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గని కార్మికుల్లో అధికులు కూటమి ప్రభుత్వానికే ఓటేశారు, ఎప్పుడు కూటమికి మెజార్టీ రాని సైదాపురం మండలంలో ఈ దఫా మెజార్టీ వచ్చింది. మేలు చేస్తారని నమ్మి ఓట్లేసినందుకు తమ బతుకులను వీధుల పాల్జేశారని కార్మికులు ఆవేదన చెందుతున్నారు.

బతుకుపై బండరాయి



మా బతుకులపై కూటమి ప్రభుత్వం బండరాయి వేసి నాశనం చేసింది. మా ఊరి దగ్గర్లోనే ఉన్న మైకా గనికి కూలీ పనులకు పోయి 45 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నాం. వర్షాలు వస్తే తప్ప గనులను మూసివేసిన చరిత్ర ఎన్నడూ లేదు. ఈ ప్రభుత్వం వచ్చాకే ఇలా జరిగింది. 270 రోజులుగా పనులు లేక అల్లాడిపోతున్నాం.

– పొట్లేళ్ల తులసమ్మ

కూలీ పనులు దొరకడం లేదు



గనుల్లో పని చేసుకుని సాయంత్రం ఇంటికి వచ్చే వాళ్లం. వారానికొకసారి డబ్బులిచ్చే వారు. తొమ్మిది నెలలుగా గనులు మూసివేయడంతో ఉన్న ఉపాధి పోయింది. ఎక్కడా పనులు కూడా దొరకడం కష్టంగానే ఉంది. భార్యబిడ్డలను కూడా పోషించలేని పరిస్థితి ఏర్పడింది. ఇన్నీ రోజులు గనులు మూతపడడం జరగలేదు.

– గంజి రత్నయ్య

వీధిన పడ్డాం



మా గ్రామాల సమీపంలోనే ఉన్న క్వారీల్లో పనులకు వెళ్లి నా భర్త నేను ఎంతో కొంత డబ్బులు సంపాదించే వాళ్లం. ఇప్పుడు పనులు లేక వీధిన పడ్డాం. మా బతుకులు రోడ్డున పడేశారు. గతంలో ఇన్ని రోజులు క్వారీలు, గనులు మూత వేయలేదు. ఇప్పుడే ఇన్ని రోజులు మూసివేసేందుకు కొత్త కారణాలు చెబుతున్నారు. వెంటనే గనులకు అనుమతులు ఇచ్చి ఆకలి కష్టాలను తీర్చాలి.

– కుమ్మరికుంట పెంచలమ్మ

నాగేంద్ర ఇన్‌ఫ్రాకు రెండు ఇసుక రీచ్‌లు



ఇసుకరీచ్‌లకు టెండర్లు నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు రూరల్: జిల్లాలోని విరువూరు, మినగల్లు ఇసుక రీచ్‌లను నాగేంద్ర ఇన్‌ఫ్రా దక్కించుకుంది. ఈ రెండు రీచ్‌లకు సంబంధించి టెండర్లు ఆహ్వానించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జేసీ కె.కార్తీక్ సమక్షంలో టెండర్లు ఓపెన్ చేశారు. విరువూరు ఇసుక రీచ్‌కు సంబంధించి రాఘవ ప్రాజెక్ట్స్, మిలీనియం సిల్ట్స్, నాగేంద్ర ఇన్‌ఫ్రా బిడ్స్ దాఖలు చేశాయి. రాఘవ ప్రాజెక్ట్స్ అర్హతలకు సంబంధించి సరైన పత్రాలు సమర్పించకపోవడంతో డిస్ క్వాలిఫై అయింది. ఇక మిలీనియం సిల్ట్స్, నాగేంద్ర ఇన్‌ఫ్రా క్యూబిక్ మీటర్‌కు రూ.25 వంతునే దాఖలు చేశాయి. అయితే ఈ టెండర్ నుంచి మిలీనియం సిల్ట్స్ తప్పుకోవడంతో నాగేంద్ర ఇన్‌ఫ్రా బిడ్‌ను ఖరారు చేశారు.

- మినగల్లు రీచ్‌కు సంబంధించి రాఘవ ప్రాజెక్ట్స్, రాజేశ్వరి శాండ్, ఎం.శ్రీహరి, నాగేంద్ర ఇన్‌ఫ్రా తరఫున నాలుగు టెండర్లు దాఖలు అయ్యాయి. అయితే రాఘవ ప్రాజెక్ట్స్, రాజేశ్వరి శాండ్ బిడ్స్ నుంచి వైదొలుగుతున్నట్లు చెప్పాయి. ఎం.శ్రీహరి క్యూబిక్ మీటర్‌కు రూ.12.75లకు బిడ్ దాఖలు చేయగా, నాగేంద్ర ఇన్‌ఫ్రా రూ.25లకు బిడ్ వేసింది. కానీ ఎం. శ్రీహరి కూడా టెండర్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడంతో ఈ రీచ్ కూడా నాగేంద్ర ఇన్‌ఫ్రాకే ఖరారైంది.

అంతా సిండికేట్ మాయ

విరువూరు, మినగల్లు రీచ్‌ల్లో ఇసుక తవ్వకానికి సంబంధించి టెండర్లు దాఖలు చేయడం, మధ్య లో అర్థాంతరంగా తప్పుకోవడం చూస్తే ఇదంతా సిండికేట్ మాయగా కనిపిస్తోంది. ఒక సంస్థకే ప్రాజెక్ట్ కట్టబెడితే ఆరోపణలు వచ్చే అవకాశం ఉండడంతో డమ్మీ టెండర్లు దాఖలు చేయించడం, చివరకు టెండర్ ప్రక్రియ నుంచి తప్పుకోవడంతో బిడ్స్ పాల్గొన్న సంస్థకే కట్టబెట్టడం అనేక రకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వేమిరెడ్డి, బీదకు భంగపాటు

జిల్లాలో పవర్ పాలిటిక్స్‌లో 'మంత్రి ఆనం'దే పై చేయిగా మారింది. డీసీసీబీ కుర్చీలో తన ముఖ్య అనుచరుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డిని కూర్చోబెట్టారు. ఆనం వ్యతిరేక వర్గంగా ఉంటూ టీడీపీలో చక్రం తిప్పుతున్నామనుకునే మరో మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఈ విషయంలో భంగపాటుకు గురయ్యారు.

- 'ఆనం' అనుచరుడు మెట్టుకూరుకే డీసీసీబీ కుర్చీ
- మాలేపాటికి మొండి చెయ్యి
- డీసీఎంఎస్ వెంకటగిరి వాసికి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: గత ఎన్నికల సమయంలో డబ్బు మూటలకే సీట్లు అమ్ముకున్న టీడీపీ మరోసారి నామినేటెడ్ పదవులు పందేరంలో కూడా అదే పాలసీని అమలు చేసిందని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. పార్టీ పట్ల విశ్వసనీయత, విధేయతలను చాటుకునే వారిని కాదని అవకాశవాద రాజకీయం చేసే వారికే పదవులు కట్టబెట్టారని డీసీసీబీ చైర్మన్‌గా మెట్టుకూరు నియామకంతో తేటతెల్లమైంది. ఎన్నికల ముందు లోకేశ్.. టీడీపీ అధిష్టానం మాత్రం నామినేటెడ్ పోస్టుల ఎంపిక విధానంలో పార్టీ విధేయతనే ప్రామాణికంగా తీసుకుంటుందని, ఎన్నికల వేళ వచ్చిన నేతలకు పదవులు ఇవ్వమని చెప్పారు.

పారని వేమిరెడ్డి పాచికలు

జిల్లా టీడీపీకి గత ఎన్నికల సమయంలో వెన్నుదన్నుగా నిలిచిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఆ పార్టీ అధిష్టానం వద్ద పరపతి కొరవడిందనే చెప్పాలి. డీసీసీబీ చైర్మన్ పదవిని తన వర్గానికి ఇప్పించుకోవాలని వేసిన పాచికలు అధిష్టానం వద్ద పారలేదు. వేమిరెడ్డి ఎంపీ అయ్యారనే కానీ.. ఆయన్ను మంత్రులు కానీ, ఎమ్మెల్యేలు కానీ గుర్తించడం లేదనేది వాస్తవం. జిల్లాలో ఒక్క కోవూరు నియోజకవర్గంలో తప్ప.. మిగతా నియోజకవర్గాల్లో ఆయన పర్యటనలకే వెళ్లడం లేదంటే.. పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో పార్టీ విజయానికి కృషి చేసిన వేమిరెడ్డి ప్రతిపాదించిన డీసీసీబీ చైర్మన్ నామినేటెడ్ పోస్టును అధిష్టానం ఇవ్వలేకపోయిందంటే ఆయనకు పార్టీలో ఉన్న ప్రాధాన్యత ఎంతో అద్దం పడుతోంది. కావలి నియోజకవర్గం దగదర్తికి చెందిన మాలేపాటి సుబ్బానాయుడు టీడీపీకి వీరవిధేయుడు. పార్టీ అధికారంలో లేనప్పుడు కావలి టీడీపీని అంతా తానై మోశాడు. పార్టీకి ఆర్థికంగా అండగా నిలిచాడు. ఎమ్మెల్సీ బీదకు ప్రధాన అనుచరుడిగా ఉన్నాడు. సార్వత్రిక ఎన్నికల ఘట్టం ప్రారంభమయ్యే చివరి వరకు ఆయనే కావలి టీడీపీ అభ్యర్థి అవుతారని అందరూ భావించారు. అయితే ఆఖరి క్షణంలో ఆ అవకాశం దక్కపోవడం, కావ్య కృష్ణారెడ్డి ఎమ్మెల్యే కావడం మాలేపాటిని అణగదొక్కే ప్రయత్నం చకచకా జరిగిపోయాయి. అయితే మాలేపాటి బీద, వేమిరెడ్డిలకు ముఖ్య అనుచరుడిగా ఉండడంతో ఆయనకు డీసీసీబీ చైర్మన్ కట్టబెట్టాలని శతధా ప్రయత్నించారు. పార్టీలో తనకు తిరుగులేదు. తనమాటే చెల్లుబాటు అవుతుందని భావిస్తున్న వేమిరెడ్డికి పార్టీ అధిష్టానం హ్యాండిచ్చిందనే చర్చ జరుగుతోంది.

మాలేపాటికి.. మరో'సారీ'

కొద్ది రోజులుగా డీసీసీబీ కుర్చీ నాకేనంటూ తెగ హడావుడి చేసిన దగదర్తికి చెందిన మాలేపాటి సుబ్బానాయుడుకు అధిష్టానం మరోసారి మొండి చేయి చూపించింది. కనీసం డీసీఎంఎస్ కుర్చీ అయినా ఇస్తారనుకున్న మాలేపాటికి అది దక్కలేదు. ఆ పదవి కూడా వెంకటగిరికి ఎమ్మెల్యేకు నీడలా వ్యవహరిస్తున్న గంగోడి నాగేశ్వరరావు యాదవ్‌కు కట్టబెట్టడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది.

ఆనందే పైచేయి..

టీడీపీ పాలిటిక్స్‌లో మంత్రి ఆనందే పైచేయిగా మారింది. గత ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలోకి వెళ్లిన ఆనంకు అధినేత అధిక ప్రాధాన్యత ఇచ్చారు. తన మంత్రి వర్గంలో చోటు కల్పించడంతోపాటు కీలకమైన డీసీసీబీ చైర్మన్ పదవిని సైతం ఆయన చెప్పిన వారికే కట్టబెట్టారు. దీంతో పార్టీలో తన పరపతి ఏమిటో చూపించాడనే చర్చ నడుస్తోంది.

డీసీసీబీ, డీసీఎమ్మెస్ చైర్మన్ల నియామకం



ధనుంజయరెడ్డి



నాగేశ్వరరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని డీసీసీబీ, డీసీఎమ్మెస్‌లకు చైర్మన్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. డీసీసీబీ చైర్మన్‌గా మెట్టుకూరు ధనుంజయరెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్‌గా వెంకటగిరికి చెందిన గంగోటి నాగేశ్వరరావును నియమించింది. ధనుంజయరెడ్డి 2013–19 మధ్య డీసీసీబీ చైర్మన్‌గా పదవిలో కొనసాగారు. ఆయన డీసీసీబీ చైర్మన్‌గా రెండో సారి బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఆశలు.. ఆవిరి!

రెండేళ్లుగా ఉన్న ధరలు చూసి పొగాకు రైతులు పెట్టుకున్న ఆశలు ఈ ఏడాది ఆవిరైపోతున్నాయి. కనీసం మద్దతు ధర కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. వేలం ప్రారంభంలో ఉన్న ధరలే నెలన్నర తర్వాత కూడా కొనసాగుతున్నాయి. నాణ్యమైన పొగాకు ధరలు ఇలా ఉంటే.. ఇక లోగ్రేడ్ రకాల ధరలపై రైతులు ఆశలు వదిలేసుకుంటున్నారు.



ఇటీవల పొగాకు వేలంను పరిశీలిస్తున్న బోర్డు ఈడీ విశ్వశ్రీ (ఫైల్)

నిరాశాజనకంగా పొగాకు మార్కెట్

- కేజీ పొగాకు ధర రూ.250 మించని వైనం
- గతేడాదితో పోల్చితే భారీగా పతనం
- నాణ్యమైన పొగాకు ధరలే ఇలా..
- లోగ్రేడ్ రకాలపై రైతుల ఆందోళన

కందుకూరు: జిల్లాలో పొగాకు రైతుల ఆశలు చిగురించే అవకాశాలు కనిపించడం లేదు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.100–110 ధరలు తగ్గడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. 2024–25 ఏడాది పొగాకు సీజన్‌కు సంబంధించి మార్చి 10న వేలం ప్రక్రియ ప్రారంభమైంది. వేలం ప్రారంభ రోజున హైగ్రేడ్ కేజీ పొగాకు ధర రూ.280 కొనుగోలు చేయగా, దాదాపు నెలన్నర తర్వాత కూడా అదే ధరలు కొనసాగుతుండడం గమనార్హం. క్వింటా హైగ్రేడ్ పొగాకు ధర రూ.28,000 వరకు ఉంటే.. లోగ్రేడ్ రూ.20,000 కూడా కొనుగోలు చేయడం లేదు. ఇక సరాసరి ధర రూ.25,000 మాత్రమే వస్తుంది. అదే 2023–24 సీజన్‌లో పొగాకు రికార్డు స్థాయిలో ధరలు పలికాయి. హైగ్రేడ్ పొగాకు క్వింటా రూ 36,000 పలకగా, సగటు ధర రూ.27,000 క్వింటాకు వచ్చింది. ప్రస్తుతం లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి అంతర్జాతీయ మార్కెట్‌ను సాకుగా చూపి ధరలు కోత వేస్తున్నారని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

కోల్డ్ స్టోరేజ్‌ల్లో నిల్వ

ప్రస్తుతం పొగాకు మార్కెట్ ఆశాజనకంగా లేకపోవడంతో అమ్ముకునేందుకు రైతులు ముందుకు రావడం లేదు. ఈ ధరలతో భారీగా నష్టపోతామని, మార్కెట్‌లో ధరలు వచ్చినప్పుడు అమ్ముకుందామనే ఉద్దేశంతో తమ వద్ద ఉన్న హైగ్రేడ్ పొగాకును కోల్డ్ స్టోరేజ్‌ల్లో నిల్వ చేస్తున్నారు. కందుకూరు పరిసర ప్రాంతాల్లోని కోల్డ్ స్టోరేజ్‌లన్నీ పొగాకు బేళ్లతో పూర్తిగా నిండిపోయాయి. అదే అదనుగా కోల్డ్ స్టోరేజ్ యజమానులు కూడా రెంట్ ధరలు పెంచారు. గతేడాది కోల్డ్ స్టోరేజ్‌లో ఒక బారు ధర రూ.25 వేలు ఉండగా, అది ఈ ఏడాది రూ.45 వేలకు పెంచేశారు. రైతులకు ఇది కూడా భారంగా మారే పరిస్థితి వచ్చింది.

భారీగా పెరిగిన పెట్టుబడులు

గతేడాది పొగాకు రైతులకు మంచి లాభాలు వచ్చాయి. దాంతో ఈ ఏడాది కూడా రైతులు భారీ స్థాయిలో సాగు చేపట్టారు. పొగాకు సాగుకు ఒక్కసారిగా డిమాండ్ రావడంతో బ్యారన్‌లు, పొలాల కౌలు ధరలు పెరిగాయి. కూలీలు, పెట్టుబడి ఖర్చులు కూడా పెరగడంతో ఒక బ్యారన్ పరిధిలో సాగుకు రూ.14 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు అయిందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం పొగాకు మార్కెట్‌లో ధరలు ఇదే విధంగా కొనసాగితే ఈ ఏడాది బ్యారన్‌కు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు నష్టం వచ్చే అవకాశాలున్నాయని ఆందోళన చెందుతున్నారు. ముమ్ముందు ఇంకా రేట్లు పతనమైతే నష్టాలు మరింతగా పెరుగుతాయని, పొగాకు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


పెట్టుబడులు వస్తాయనే ఆశ లేదు



సొంత పొలం, బ్యారన్ ఉంది. గతేడాదితో పోల్చితే పెట్టుబడులు భారీగా పెరిగాయి. అయితే ప్రస్తుతం పొగాకు మార్కెట్ బాగా లేదు. ఇదే విధంగా ఉంటే పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. ధరలు రోజు రోజుకు పతనం అవుతున్నాయి. సరాసరి ధరలు పెంచకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారు.

– నలగర్ల రవికుమార్, పోలినేనిపాళెం


ధరలు పెంచడం లేదు



రెండు ఎకరాలు సొంత పొలం, 8 ఎకరాలు కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేశాను. ఇప్పుడు ఉన్న ధరల ప్రకారం అయితే నాకు భారీగా నష్టాలు తప్పేటట్లు లేదు. గతేడాదితో పోల్చితే ధరలు బాగా తగ్గిపోయాయి. గత నెల రోజులుగా మార్కెట్ ఒకే రేటుపై నడుస్తోంది. బయ్యర్లు ఏ మాత్రం ధరలు పెంచడం లేదు.

– రూపినేని మాల్యాద్రి, వలేటివారిపాళెం

ఇలాగైతే నష్టాలు తప్పవు



పది ఎకరాలు సొంతంగా, మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశాను. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది అన్నింటి ధరలు పెరగడం వల్ల పెట్టుబడులు రెట్టింపయ్యాయి. అయితే పొగాకు ధరలు మాత్రం ఊహించని విధంగా పడిపోయాయి. ఒక్కొక్క బ్యారన్ పరిధిలో రూ.3 లక్షల వరకు నష్టపోయే పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

– కట్టా హనుమంతరావు, వలేటివారిపాళెం

వందల్లో వినతులు

- కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- రెవెన్యూ శాఖవే అధికం



సమస్యలు తెలుసుకుంటున్న జేసీ కార్తీక్

నెల్లూరు రూరల్: వినతుల సంఖ్య ఏ మాత్రం తగ్గలేదు. జిల్లా నలుమూలల నుంచి సమస్యలపై నెల్లూరు కలెక్టరేట్‌కు వచ్చేవారి సంఖ్య నానాటికీ పెరుగుతూనే ఉంది. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. అర్జీదారుల నుంచి జేసీ కె.కార్తీక్ ఆధ్వర్యంలో అధికారులు వినతులు స్వీకరించారు. మొత్తం 455 అర్జీలు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 194, పోలీస్ శాఖవి 63, మున్సిపల్ శాఖవి 30, సర్వేవి 43, పంచాయతీరాజ్ శాఖవి 31 తదితరాలున్నాయి. కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కళ్లు తిరిగి పడిపోయిన హెల్త్‌వర్కర్

తిక్కన ప్రాంగణంలో మెడికల్ క్యాంప్‌లో హెల్త్‌వర్కర్ కల్యాణి కళ్లు తిరిగి కింద పడిపోయింది. ముక్కు నుంచి రక్తస్రావమైంది. వెంటనే డాక్టర్ పరీక్షించి బీపీ తగ్గడంతో ఇలా జరిగిందని తెలిపారు.

అధికారుల మీనమేషాలు

కొత్తూరు బిట్ – 2లో కండలేరు ముంపు బాధితుల పునరావాస స్థలంలో బావులను పూడ్చేసి ఆక్రమించిన వ్యక్తిపై ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోలేదని వి.రమేష్‌రెడ్డి జేసీకి వినతిపత్రం సమర్పించాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంతారావు అనే వ్యక్తి సదరు స్థలాన్ని అమ్మేందుకు బహిరంగంగా అతని ఫోన్ నంబర్‌ను తూములపై రాసినా అధికారుల్లో చలనం లేదన్నారు. నాలుగోసారి గ్రీవెన్స్‌కు వచ్చానన్నారు. తహసీల్దార్ లాజరస్, ఆర్‌ఐ, వీఆర్వోలు కనీసం వచ్చి పరిశీలించలేదన్నారు. వినతిని పరిశీలించిన జేసీ తహసీల్దార్‌కు అప్పటికప్పుడే ఫోన్ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారని రమేష్‌రెడ్డి తెలిపారు.



మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

ప్రైవేట్ విద్యాసంస్థల్లో తనిఖీలు చేయాలి



మాట్లాడుతున్న అసోసియేషన్ నేతలు

ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధికారులు తనిఖీలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ నేతలు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా పాఠశాల భవనాలున్నాయో? లేదో? చూడాలన్నారు. విద్యుత్ వైరింగ్ సక్రమంగా ఉందో, అగ్నిమాపక పరికరాలు ఉన్నాయో లేదో? పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శిఖరం నరహరి, కార్యదర్శి ఈశ్వరయ్య, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి రాజశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ..

తండ్రి ఇచ్చిన 9 సెంట్ల భూమిని ఆదాం అనే వ్యక్తి ఆక్రమించి గత నెలలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని కందుకూరు ప్రకాశం కాలనీకి చెందిన దివ్యాంగురాలు హెబ్సిక జేసీకి వినతిపత్రం సమర్పించారు. ఆమె మాట్లాడుతూ ఆదాం పలుకుబడి ఉపయోగించి రిజిస్ట్రార్‌తో కుమ్మక్కై తమ స్థలాన్ని కాజేశారన్నారు. రిజిస్ట్రార్‌ను కలిసి అడిగితే కోర్టులో తేల్చుకోమన్నాడని వాపోయారు. అధికారుల న్యాయం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న హెబ్సిక

ఇంటిని ఆక్రమించారు

నాకు పిత్రార్జితంగా వచ్చిన ఇంటి స్థలాన్ని ఇరగల మాల్యాద్రి అనే వ్యక్తి ఆక్రమించాడని కొండాపురం మండలం తూర్పుఎర్రబల్లి గ్రామానికి చెందిన కందవరపు కోటయ్య వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తనకు కంటిచూపు లేదన్నారు. స్థలం విషయమై అతడిని బతిమిలాడితే దిక్కున్న చోట చెప్పుకోమన్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. తన వదినను కొట్టాడన్నారు. అధికారులు విచారించాలని కోరాడు. కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.



అధికారులకు అర్జీ ఇచ్చిన కోటయ్య

ఆస్తి కోసం.. మానవత్వం లేకుండా..

- కడుపున పుట్టిన వారు వేధిస్తున్నారు
- వృద్ధుల కన్నీటి వేదన
- పోలీసు అధికారులకు అందిన ఫిర్యాదులు



బాధితుల సమస్యలు వింటున్న పోలీస్ అధికారి

నెల్లూరు(క్రైమ్): కొందరు ఆస్తి కోసం కన్నవారి పట్ల క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేసి ఆస్తి రాయించుకుని వారిని దూరం పెడుతున్నారు. పోలీస్ అధికారులు నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇలాంటి వినతులు అధికంగా అందుతున్నాయి. కడుపున పుట్టిన వారు ఎలా వేధిస్తున్నారో వృద్ధులు అధికారులకు విన్నవించి కన్నీటి పర్యంతమవుతున్నారు. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. డీటీసీ, మహిళా పోలీస్‌స్టేషన్ల డీఎస్పీలు గిరిధర్, చెంచు రామారావులు ఫిర్యాదులు స్వీకరించి ఆయా ప్రాంతాల పోలీస్ అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో వాటిని పరిష్కరించాలని సూచించారు. మొత్తం 115 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌బీ – 2 ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, ఫిర్యాదుల సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాపం వృద్ధులు

- నాకు ముగ్గురు కుమార్తెలు. నా భర్త జీవించి ఉన్న సమయంలో ఆస్తిని సమంగా పంచారు. ప్రస్తుతం నా పేరుపై ఉన్న ఇంటిని వారు ఆక్రమించారు. విధిలేని పరిస్థితుల్లో నా మేనల్లుడు వద్ద ఉంటున్నాను. విచారించి న్యాయం చేయాలని నెల్లూరు జాకీర్‌హుస్సేన్‌నగర్‌కు చెందిన సుగుణమ్మ కోరారు.
- నా పేరుపైనున్న ఇంటిని నాకు తెలియకుండానే కొడుకు, కోడలు వారి పేరు మీదకు మార్చుకున్నారు. నా బాగోగులు పట్టించుకోవడం లేదు. జీవనం కష్టతరంగా మారింది. తగిన చర్యలు తీసుకోవాలని వింజమూరుకు చెందిన ఓ వృద్ధుడు కోరాడు.
- నా పేరుపై ఉన్న ఆస్తిని కొడుకు, కోడలు తమ పేరుపై రాయించుకుని ఇంటి నుంచి తరిమేశారు. తెలిసిన వారి ఇంట్లో తలదాచుకుంటున్నాను. న్యాయం చేయాలని కలిగిరికి చెందిన ఓ వృద్ధురాలు ఫిర్యాదు చేసింది.

ఫిర్యాదుల్లో మరికొన్ని..

- హైదరాబాద్‌కు చెందిన స్పందన అనే మహిళ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.4.75 లక్షలు తీసుకుంది. నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చి మోసగించిందని కావలికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- ఇందుకూరుపేట పరిధిలోని సురేష్, అతని భార్య ఓ హాస్పిటల్లో కంప్యూటర్ ఆపరేటర్, సూపర్‌వైజర్, నర్సు, అసిస్టెంట్లుగా ఉద్యోగాలిప్పిస్తానని రూ.13 లక్షలు తీసుకుని మోసగించారని ఆరుగురు బాధితులు వాపోయారు.
- పరంధామయ్య అనే వ్యక్తి తాను పనిచేస్తున్న చోట షిఫ్ట్ ఆపరేటర్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని రూ.1.50 లక్షలు నగదు తీసుకుని మోసగించాడు. అతనిపై చర్యలు తీసుకోవాలని జనార్దనరెడ్డికాలనీకి చెందిన శివకుమార్ పోలీసు అధికారులను కోరాడు.
- నా తల్లిదండ్రులు అనుమానాస్పదంగా మృతిచెందారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపి వారి మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని వెంకటాచలం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- నా భార్య ఈనెల 16వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఇద్దరు చిన్నపిల్లలున్నారు. ఆమె ఆచూకీ కనుక్కోవాలని జలదంకికి చెందిన ఓ వ్యక్తి అర్జీ ఇచ్చాడు.
- నా భర్త మద్యానికి బానిసయ్యాడు. నగదు కోసం వేధిస్తున్నాడు. పిల్లల బాగోగులు పట్టించుకోవడం లేదు. కౌన్సెలింగ్ నిర్వహించి కాపురాన్ని చక్కదిద్దాలని కావలి రూరల్ పరిధికి చెందిన ఓ మహిళ అభ్యర్థించారు.
- గుర్తుతెలియని వ్యక్తులు నా క్రెడిట్‌కార్డును హ్యాక్ చేసి రూ.70 వేల నగదు కాజేశారు. తగిన చర్యలు తీసుకోవాలని బాలాజీనగర్‌కు చెందిన మహిళ కోరారు.

ట్రాక్టర్ ఢీకొని..

- ఒకరు మృతి

వలేటివారిపాళెం: ట్రాక్టర్ ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని అంకభూపాలపురం పెట్రోల్ బంక్ సమీపంలో 167బీ హైవేపై సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని అత్తంటివారిపాళేనికి చెందిన కొల్లూరి మాధవరావు (48) మరో ఇద్దరు కలిసి బైక్‌పై పామూరు వెళ్తున్నారు. గ్రావెల్ కోసం ట్రాక్టర్ లింగపాళెం వెళ్తోంది. హైవే క్రాస్ చేస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. మాధవరావు రోడ్డుపై పడి తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్సై మరిడి నాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. మాధవరావు తండ్రి నరసయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మాధవరావు మృతదేహం

పెయింటర్ అనుమానాస్పద మృతి

ఇందుకూరుపేట: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన మండలంలోని రావూరు గ్రామంలో సోమవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. కోవూరు మండలం చెర్లోపాళెం గ్రామానికి చెందిన కవరగిరి రవి (39) పెయింటర్. తనతోపాటు పనిచేసే పెంచలరావు, విజయ్, రాజేష్‌తో కలిసి ఆదివారం మైపాడు బీచ్‌కు వెళ్లాడు. అందరూ కలిసి సముద్రంలో స్నానం చేస్తుండగా రవి పని ఉందని నీటిలో నుంచి బయటకు వచ్చాడు. ఈ విషయం ఆ ముగ్గురికి తెలియదు. పర్యాటకులు ఎక్కువగా ఉండటంతో అతను ఎక్కడో ఒకచోట మునుగుతూ ఉంటాడని భావించారు. కాసేపటి తర్వాత వారు రవి కోసం వెతికినా కనిపించలేదు. దుస్తులు, సెల్‌ఫోన్, వాచ్ ఒడ్డున కనిపించాయి. దీంతో ఈ విషయాన్ని రవి కుటుంబ సభ్యులకు చెప్పారు. సముద్రంలో గల్లంతై ఉంటాడని రాత్రంతా వెతికారు. కాగా సోమవారం వేకువజామున రావూరుకండ్రిగ సమీపాన రోడ్డు పక్కన ఓ వ్యక్తి పడి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. వారు వెళ్లి పరిశీలించి రవిగా గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులకు తెలియజేశారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరాతీశారు.

క్లుప్తంగా

కేజీబీవీ విద్యార్థినులకు జేసీ అభినందనలు



నెల్లూరు రూరల్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల విద్యార్థినులను జాయింట్ కలెక్టర్ కార్తీక్ అభినందించారు. 573 మార్కులు సాధించిన వలేటివారిపాళెం విద్యార్థిని జి.వైష్ణవి, 569 మార్కులు సాధించిన లింగసముద్రం విద్యార్థిని ఎం.అమృతప్రియ, 567 మార్కులు సాధించిన కలిగిరి విద్యార్థిని పి.మహిమకు సోమవారం కలెక్టరేట్‌లో జ్ఞాపికలు అందజేశారు.

రైల్లో నుంచి పడి వ్యక్తి మృత్యువాత

కొడవలూరు: రైల్లో నుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కొడవలూరు రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం జరిగింది. రైల్వే పోలీసులు వివరాలు ఆరాతీశారు. మృతుడి వయసు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని న్యూ జల్పైగురి నుంచి చెన్నై సెంట్రల్ స్టేషన్‌కు తీసుకున్న టికెట్‌ను అతడి వద్ద గుర్తించారు.

పని నిమిత్తం వెళ్తుండగా..

- ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి మృతి



బాలప్రసాద్ (ఫైల్)

సోమశిల: ట్రాక్టర్ బోల్తా పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మంగుపల్లి – చిలకలమర్రి ప్రధాన రహదారిపై సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. అనంతసాగరం మండల పరిధిలోని మంగుపల్లి గ్రామానికి చెందిన బోయిళ్ల గురుప్రసాద్, కృష్ణమ్మ దంపతుల పెద్ద కుమారుడు బాలప్రసాద్ (22) సొంత పని నిమిత్తం ట్రాక్టర్‌పై చిలకలమర్రికి వెళ్తుండగా బోల్తా పడింది. దీంతో స్థానికులు బాలప్రసాద్‌ను 108లో ఆత్మకూరుకు తరలిస్తుండగా మృతిచెందాడు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.105
సన్నవి : రూ.80
పండ్లు : రూ.50

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 102
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 188
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 208
లేయర్ చికెన్	: 170

హామీలను విస్మరించడం బాబు నైజం

- వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'మేనిఫెస్టోలోని హామీలను విస్మరించడం చంద్రబాబు నైజం. ఉద్యోగులకు మంచి పీఆర్సీ, మధ్యంతర భృతి ఇస్తామని చెప్పి పట్టించుకోవడం లేదు' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉర్సా వంటి కంపెనీలకు దోచిపెట్టడానికే తప్ప ఉద్యోగులకు ఇళ్ల స్థలాలివ్వడానికి ప్రభుత్వానికి మనసు రావడం లేదన్నారు. కొత్త పీఆర్సీ ఊసేలేదన్నారు. రాష్ట్రంలో అన్ని రకాల ఉద్యోగులు సుమారు 15 లక్షలుంటే 50 వేల మందికి మాత్రమే ఒకటో తేదీన జీతాలు వేస్తూ అందరికీ వేస్తున్నామని బాబు సభల్లో చెప్పుకొంటున్నారన్నారు. సీపీఎస్ విధానం కింద సుమారు 3 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారన్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సీపీఎస్ విధానం స్థానంలో జీపీఎస్ విధానాన్ని తీసుకొచ్చి మెరుగైన ప్రయోజనాలు కల్పిస్తానని జీఓ కూడా ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం ఆ జీఓను పక్కనపెట్టి ఇప్పుడు వారికి మొండి చేయి చూపిస్తోందన్నారు. ఉద్యోగులకు రూ.30 వేల కోట్లు బకాయిలు చెల్లించకుండా ఆలస్యం చేస్తోందన్నారు. ప్రతి ఉద్యోగికి, పెన్షనర్‌కి సుమారు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉందన్నారు. వలంటీర్లకు జీతం పెంచుతామని చెప్పి ఇప్పుడు వారిని పట్టించుకోవడం లేదన్నారు. వివిధ శాఖల్లోని చిరుద్యోగులు రోడ్డుపైకి వచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. నిరుద్యోగ భృతి హామీ ఎటుపోయిందో తెలియదన్నారు. కంపెనీలు పెట్టాం, ఉద్యోగాలు వచ్చాయని ప్రసంగాల్లో చెబుతున్నారని, కానీ అవి ఎక్కడున్నాయో తెలియదన్నారు. ఊరు, పేరు లేని కంపెనీలకు వేల కోట్ల రూపాయల విలువైన భూముల్ని అత్యంత తక్కువ ధరకు ఇచ్చేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగుల గురించి ఆలోచించడం లేదన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా కూటమి ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.

రాడార్ కేంద్రంలో వసతుల కల్పనకు చర్యలు

- పరిశీలించిన అధికారులు

పొదలకూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని నెల్లూరు మార్గం మరుపూరు రెవెన్యూ విలేజ్ పరిధిలో ఉన్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రాడార్ కేంద్రంలో వసతులను కల్పించేందుకు అన్ని శాఖల అధికారులు సమాయత్తమయ్యారు. సోమవారం కేంద్రం వద్దకు వెళ్లి నీరు, ఇంటర్నెట్, రోడ్లు తదితర సౌకర్యాల కోసం పరిశీలించారు. తహసీల్దార్ బి.శివకృష్ణయ్య ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్, ఆర్అండ్‌బీ, విద్యుత్, అటవీ, జలవనరుల శాఖల అధికారులు వివిధ అంశాలపై చర్చించారు. రాడార్ కేంద్రం పనులు కొంతకాలంగా జరుగుతున్నాయి. మరుపూరుకు సమీపంలో 8 ఏళ్ల క్రితం రాడార్ కేంద్రం నిర్మాణానికి 62 ఎకరాల రెవెన్యూ భూమిని కేటాయించారు. తర్వాత చాలాకాలం పనులు చేపట్టలేదు. ఇటీవల కేంద్రంలో పనులను చేపట్టి వేగంగా నిర్వహిస్తున్నారు. ప్రధానంగా నీటి అవసరాలను తీర్చేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కండలేరు కాలువ ద్వారా నీటిని అందించడమా? లేక మరుపూరు చెరువు నుంచి సరఫరా చేయడమా? అనే దానిపై చర్చిస్తున్నట్టు సమాచారం. విద్యుత్ సౌకర్యాన్ని దగ్గరలోని చాటగొట్ల విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి కల్పిస్తున్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఇండో – నేపాల్ 4వ ఎంజీకే అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్‌లో నెల్లూరీయులు ప్రతిభ చూపారు. ఇటీవల నేపాల్‌లో జరిగిన ఈ పోటీల్లో అండర్ – 19 విభాగం కటా ఈవెంట్‌లో స్పోర్ట్స్ కరాటే ఫౌండేషన్‌కు చెందిన పునీత్ బంగారు పతకం, అండర్ – 15 కటా ఈవెంట్‌లో ఎస్.ఇందుమతి బంగారు పతకం, అండర్ – 13 కటా ఈవెంట్‌లో ఎస్.ప్రియ సిల్వర్ మెడల్ సాధించారని మాస్టర్ షిహాన్ మురళి సోమవారం తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు సహకారం అందించిన నెల్లూరు జిల్లా యూత్ ఆఫీసర్, నెహ్రూ యువ కేంద్రం అధికారి మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్‌ఎంపీ ఖాతాలో నగదు మాయం

కోవూరు: మండలంలోని పోతిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన తొట్టెంపూడి అంకయ్య అనే ఆర్‌ఎంపీ బ్యాంక్ ఖాతాలోని నగదును సైబర్ నేరగాళ్లు కొట్టేశారు. పోలీసుల కథనం మేరకు.. అంకయ్య గోల్డ్ లోన్ చెల్లించేందుకు యోనో యాప్ తెరిచాడు. ఇంతలో అప్‌డేట్ అడిగింది. ఆ సమయంలో మొదట రూ.40 వేలు, రెండోసారి రూ.40 వేలు, తర్వాత రూ.20 వేలు బ్యాంక్ ఖాతా నుంచి కట్ అయ్యినట్లు మెసేజ్‌లు వచ్చాయి. తన ఫోన్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకొందని తెలుసుకొన్న అంకయ్య బ్యాంక్‌కు వెళ్లి అకౌంట్‌ను బ్లాక్ చేయించాడు. అనంతరం కోవూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు.

తూతూమంత్రంగా శిక్షణ



శిక్షణకు విచ్చేసిన విద్యార్థిని

దుత్తలూరు: ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులకు చేపట్టిన శిక్షణ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో తూతూమంత్రంగా జరుగుతోంది. దుత్తలూరు మోడల్ పాఠశాలలో మొదటి సంవత్సరంలో 51 మంది, ద్వితీయ సంవత్సరంలో 24 మంది ఫెయిలయ్యారు. వీరిని పాఠశాలలకు రప్పించి ఫెయిలైన సబ్జెక్ట్‌ల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శిక్షణ ఇవ్వాలి. సోమవారం పాఠశాలకు ఒక్క విద్యార్థిని మాత్రమే హాజరైంది. టీచర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ కనిపించారు. కొద్దిరోజులుగా మొక్కుబడిగా ఈ శిక్షణ కొనసాగుతోందని విమర్శలున్నాయి. ఈ విషయమై ప్రిన్సిపల్ సైమన్‌రావును వివరణ కోరగా ఉపాధ్యాయులు ప్రణాళిక ప్రకారం వస్తున్నారని, ఎండలకు విద్యార్థులు రావడం లేదని, ఇందుకు తామేమి చేయాలన్నారు.

న్యాయమూర్తులకు ఆత్మీయ వీడ్కోలు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

నెల్లూరు(లీగల్): ఇటీవల బదిలీ అయిన నెల్లూరు 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.అఖిల, 5వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టు జి.దేవికకు నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానం నిర్వహించారు. నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇద్దరు న్యాయమూర్తులు కేసుల పరిష్కారంలో ప్రతిభ చూపించాలని కొనియాడారు. న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్‌రెడ్డి, సుందరయ్య యాదవ్ మాట్లాడారు.